# ఐటీ కంపెనీలకు పోలీసుల ట్రాఫిక్ అడ్వైజరీ



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** హైదరాబాద్ నగరంలో గురువారం సాయంత్రం మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పోలీసులు పేర్కొన్నారు. సైబరాబాద్ ప్రాంతంలో పనిచేస్తున్న అన్ని కంపెనీలు, సంస్థలు ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ఉద్యోగులకు త్వరగ లాగౌట్ అవకాశ కల్పించాలని సూచించారు. వీలైతే వర్క్ ఫ్రమ్ హోమ్ ఇవ్వాలని కోరారు. మధ్యాహ్నం 2:00 గంటల నుండి దశలవారీగా ముందుగానే లాగౌట్ చేయాలని సూచించారు. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.



AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

WWW.AKSHARATODAYNEWS.COM


# లిస్టింగ్‌లో అదరగొట్టిన ఐపీవో




**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** ఇండో ఎంఐఎం షేర్లు గురువారం స్టాక్ మార్కెట్‌లో లిస్టయ్యాయి. ఐపీవో అలాట్ అయినవారికి లిస్టింగ్ సమయంలోనే 43 శాతానికిపైగా లాభాన్ని అందించాయి. మెటల్ ఇంజెక్షన్ మోల్డింగ్ (ఎంఐఎం) సాంకేతికతను ఉపయోగించి ఇంజినీరింగ్ భాగాలను తయారు చేసే ఇండో ఎంఐఎం లిమిటెడ్ కంపెనీని 1996లో స్థాపించారు. ఇది ఆటోమోటివ్, రక్షణ, వైద్య, వినియోగదారు, ఏరోస్పేస్ రంగాల కోసం మోల్డ్ డిజైన్, టూలింగ్, ఫినిషింగ్, అసెంబ్లీలతో సహా పూర్తి స్థాయి సొల్యూషన్స్ అందిస్తుంది.


30-7-2026 (Thursday) MAIN EDITION


## ప్రతిపక్షాలపై జేపీ నడ్డా ఆగ్రహం



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** రాజ్యసభలో ప్రతిపక్షాల తీరుపై కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి సభ సజావుగా సాగకుండా ప్రతిపక్షాలు కావాలనే ఆటంకం కలిగిస్తున్నాయని ఆరోపించారు.

## నాంపల్లి కోర్టుకు భట్టి విక్రమార్క



**అక్షరటుడే, హైదరాబాద్ :** నాంపల్లిలోని ఎంపీలు, ఎమ్మెల్యేల ప్రత్యేక కోర్టులో గురువారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హాజరయ్యారు. 2022లో కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రి వద్ద కోవిడ్ నిబంధనలకు విరుద్ధంగా ప్రెస్ మీట్ నిర్వహించారన్న ఆరోపణలపై ఆయనపై కేసు నమోదైంది.

## హాకీ జట్టు జెర్సీ రంగు మార్పుపై ప్రియాంకా గాంధీ ఫైర్



**అక్షరటుడే, న్యూ ఢిల్లీ :** భారత హాకీ జట్టు జెర్సీ రంగు మార్పుపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంట్ వెలుపల మీడియాతో మాట్లాడిన ఆమె.. జెర్సీ రంగులను మార్చడం ద్వారా చరిత్రను తిరగరాయాలని చూస్తున్నారని ఆరోపించారు.

# ప్రాజెక్టులకు జలకళ



**అల్ప పీడన ప్రభావంతో రాష్ట్రంలో భారీ వర్షా లు కురుస్తున్నాయి. నాలుగు రోజులుగా వానలు పడుతుండటంతో వాగులు, నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. చెరువులు, జలాశయాలకు వరద వస్తోంది. దీంతో మొన్నటి వరకు వెలవెలబోయిన ప్రాజెక్ట్‌లు నేడు జలకళను సంతరించుకున్నాయి. ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.**

**- అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి**

■ రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షా లు ■ వాగులు, నదులకు పోటెత్తిన వరద ■ అన్నదాతల హర్షం

తెలంగాణతో పాటు మహారాష్ట్ర, కర్ణాటకలో కురుస్తున్న వర్షాలతో కృష్ణానదికి వరద పోటెత్తింది. కర్ణాటకలోని ఆల్మట్టి, నారాయణపూర్ జలాశయాల నుంచి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఆల్మట్టి పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 123 టీఎంసీలు కాగా ప్రస్తుతం 117 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 83 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 97,078 క్యూసెక్కులు దిగువకు విడుదల చేనస్తున్నారు. ఆల్మట్టి, నారాయణపూర్ నుంచి జూరాలకు భారీగా వరద వస్తోంది. జూరాల ప్రాజెక్టుకు 91 వేల క్యూసెక్కుల వరద వస్తుండగా. 10 క్రస్ట్ గేట్లను ఎత్తి శ్రీశైలం ప్రాజెక్టుకు 81 వేల 695 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుత 7.3 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు కుడి ఎడమ కాలువల ద్వారా సాగునీటిని విడుదల చేస్తున్నారు. ఎగువ, దిగువ జలవిద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి కొనసాగుతుంది. జూరాల నుంచి శ్రీశైలం డ్యామ్ వరద కొనసాగుతోంది.

### గోదావరి ఉధృతి


ఉత్తర తెలంగాణ వరప్రదాయని శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్‌కు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో కురుస్తున్న వర్షాలతో జలాశయంలోకి ప్రస్తుతం 9200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్ట్ నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం 17 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మరోవైపు కాళేశ్వరం దిగువన గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. భద్రాచలం వద్ద గురువారం ఉదయం 3,00,000 క్యూసెక్కుల స్థాయి నుండి కొద్ది గంటల్లోనే 4,00,000 క్యూసెక్కులకు పైగా పెరిగింది. ప్రాణహిత, ఇంద్రావతి, శబరి నదీ పరీవాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండటంతో వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉంది. నది పరివాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

### తాలిపేరు గేట్లు ఎత్తివేత

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టుకు వరద పోటెత్తింది. ఛత్తీస్‌గఢ్‌లో కురిసిన భారీ వర్షాల కారణంగా ప్రాజెక్టులోకి భారీగా వరద వస్తోంది. దీంతో 24 గేట్లను ఎత్తి 98 వేల క్యూసెక్కులను గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. నిర్మల్ జిల్లాలో అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో కడెం ప్రాజెక్ట్ నిండుకుండలా మారింది.

## రిటైర్మెంట్ ప్రకటించిన అజింక్య రహానే

**అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్ :** భారత క్రికెటర్ అజింక్య రహానే క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించారు. ఈ మేరకు గురువారం ఆయన సోషల్ మీడియా వేదికగా వీడియో విడుదల చేశారు. తన బ్యాటింగ్‌తో ఆకట్టుకునే రహానేకు విదేశీ పిచ్‌లపై మంచి రికార్డు ఉంది. అతడు 85 టెస్టులు, 90 వన్డేలు, 20 టీ20లలో భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు. మొత్తం 8 వేలకు పైగా పరుగులు సాధించాడు. రహానే కెప్టెన్సీలో 2020-21 భారత్ బోర్డర్‌గవాస్కర్ ట్రోఫీని గెలుచుకుంది. గాయాలతో సతమతమవుతున్న భారత జట్టుకు నాయకత్వం వహించడంతో పాటు ఆస్ట్రేలియా గడ్డపై చారిత్రాత్మక 2-1 టెస్టు సిరీస్ విజయాన్ని అందించారు.



## నిర్భయంగా పని చేయండి

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** సీఆర్‌పీఎఫ్ డైరెక్టర్ జనరల్ జ్ఞానేంద్ర ప్రతాప్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. సిబ్బంది నిర్భయంగా పని చేయాలని సూచించారు. శాంతి భద్రతలు, దేశ రక్షణ కోసం వారు తీసుకునే నిర్ణయాలకు తాను బాధ్యత తీసుకుంటానని తెలిపారు. కాక్రోచ్ జనతా పార్టీ నిరసనల్లో భాగంగా జులై 20న పోలీసులు ఆందోళనకారులపై లాఠీచార్జీ చేసిన విషయం తెలిసిందే. విద్యార్థులపై లాఠీచార్జ్ చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని సీజేపీ, విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ క్రమంలో సీఆర్‌పీఎఫ్ చీఫ్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

## పార్లమెంట్ ఆవరణలో ప్రతిపక్ష ఎంపీల నిరసన




**అక్షరటుడే, ఢిల్లీ :** కాంగ్రెస్ సహా ప్రతిపక్ష ఎంపీలు గురువారం పార్లమెంట్ ఆవరణలో నిరసన తెలిపారు. అయోధ్యలోని రామమందిర విరాళాల దుర్వినియోగం, విద్యార్థులపై లాఠీచార్జీకి వ్యతిరేకంగా ఆందోళన నిర్వహించారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జులై 20న విద్యార్థి నిరసనకారులపై పోలీసు చర్యకు ఎవరు ఆదేశాలు ఇచ్చారనే ప్రశ్నలతో కూడిన ప్లకార్డులను పట్టుకుని 'ఇండియా' కూటమికి చెందిన పలు పార్టీల ఎంపీలు నిరసన తెలిపారు. విద్యార్థులపై బలప్రయోగం, అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి ఆలయానికి ఇచ్చిన విరాళాలలో ఆర్థిక అవకతవకల ఆరోపణలపై కేంద్రం బాధ్యత వహించాలని నినాదాలు చేశారు. ఈ నిరసనలో కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీ సైతం పాల్గొన్నారు. సభకు అమిత్ హాజరు కావాలని ఆమె డిమాండ్ చేశారు.

## మైక్రోసాఫ్ట్ నుంచి ఏఐ యాప్



**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** ప్రముఖ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ ఓపెన్‌ఏఐ, ఆంత్రోపిక్ వంటి సంస్థలకు గట్టి పోటీ ఇచ్చేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగానే కంపెనీ త్రైమాసిక ఫలితాల ప్రకటన సందర్భంగా సరికొత్త ఏఐ సూపర్ యాప్‌ను తీసుకురానున్నట్లు సీఈవో సత్య నాదెళ్ల వెల్లడించారు. సాధారణ చాట్‌బాట్ స్థాయి నుంచి కోపైలట్ చాలా వేగంగా అభివృద్ధి చెంది, ఇప్పుడు సరికొత్త 'సూపర్ యాప్' రూపును సంతరించుకుంటోందని సత్య నాదెళ్ల తెలిపారు. ఇది తమ కంపెనీకి కీలకమైన మైలురాయి అని అభివర్ణించారు. ఈ యాప్ ద్వారా సాధారణ ఏఐ యాప్‌లతో చేసే పనుల కంటే ఎంతో సులభంగా మరిన్ని పనులు పూర్తి చేసుకోవచ్చని వివరించారు.

## రాహుల్ గాంధీ స్పీచ్‌కు డుమ్మా కొట్టిన కాంగ్రెస్ ఎంపీ

**అక్షరటుడే, న్యూఢిల్లీ :** రాహుల్ గాంధీ బుధవారం లోక్‌సభలో ప్రసగించిన విషయం తెలిసిందే. పంజాబ్‌లోని జలంధర్ కాంగ్రెస్ ఎంపీ చరణ్‌జిత్ సింగ్ చన్నీ రాహుల్ గాంధీ ప్రసంగానికి హాజరు కాకుండా, ఫరీద్‌కోట్‌లో జరిగిన ర్యాలీలో పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్లమెంటరీ గ్రూపుకు నేతృత్వం వహిస్తున్న అమృత్‌సర్ ఎంపీ గుర్జిత్ సింగ్ ఔజ్లా, గాంధీ ప్రసంగ సమయంలో సభకు హాజరు కావాలని ఎంపీలందరికీ వాట్సాప్ సందేశం పంపినట్లు సమాచారం. అయినా కూడా చన్నీ రాకపోవడం గమనార్హం. ఫార్మసీ ఆఫీసర్ రిక్రూట్‌మెంట్ పరీక్షలో జరిగిన అక్రమాల వివాదంపై ఆప్ ప్రభుత్వానికి వ్యతిరేకంగాఆయన నిరసన తెలిపారు.



## ఇరాన్‌పై అమెరికా భారీ దాడులు




**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** ఇరాన్‌లో అమెరికా తాజాగా దాడులు నిర్వహించినట్లు ఆ దేశ సైన్యం తెలిపింది. చమురు శుద్ధికి కీలక కేంద్రమైన ఇరాన్‌లోని అబాదాన్ తో పాటు పలు చోట్ల అమెరికా వైమానిక దాడులు చేపట్టినట్లు తెలుస్తోంది. దీంతో ఘర్షణలు మరింత తీవ్రరూపం దాల్చే అవకాశం కనిపిస్తోంది. జోర్డాన్‌లోని ఒక అమెరికన్ స్థావరాన్ని లక్ష్యంగా చేసుకుని ఇరాన్ జరిపిన క్షిపణి దాడికి ప్రతీకారంగా, అమెరికా సైన్యం ఇరాన్‌పై వైమానిక దాడులు ప్రారంభించింది. చర్చలను పునఃప్రారంభించేందుకు వీలుగా గత వారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బాంబు దాడులను నిలిపివేసిన తర్వాత ఇరాన్‌పై అమెరికా జరిపిన మొదటి దాడులు ఇవే కావడం గమనార్హం. అమెరికా బలగాలపై ఇరాన్ జరిపిన దాడి ప్రయత్నాలకు ఈ దాడులు శక్తివంతమైన ప్రతిస్పందన అని యూఎస్ సెంట్రల్ కమాండ్ పేర్కొంది.

## ఆమ్ ఆద్మీ పార్టీపై బీజేపీ ఆగ్రహం

**అక్షరటుడే, ఢిల్లీ :** పంజాబ్‌లో పేపర్ లీక్ ఆరోపణలపై ఆప్ కార్యాలయం వెలుపల బీజేపీ కార్యకర్తలు నిరసన చేపట్టారు. పంజాబ్ విద్యాశాఖ మంత్రి హర్‌జ్యోత్ సింగ్ బైన్స్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ ఎంపీ బాన్సురి స్వరాజ్ మాట్లాడుతూ.. ఆప్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆప్ ఎప్పుడూ ద్వంద్వ వైఖరిని అవలంబిస్తుందన్నారు. రాష్ట్రంలో ఫార్మసీ రిక్రూట్‌మెంట్ పరీక్షలో జరిగిన అవకతవకల విషయంలో వారు ఎందుకు బాధ్యత తీసుకోవడం లేదని ఆమె ప్రశ్నించారు. నీట్ పరీక్షకు సంబంధించిన అవకతవకల తర్వాత, ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం పేపర్ లీక్ నిరోధక చట్టాన్ని మరింత పటిష్టంగా, కఠినతరం చేసిందన్నారు. మరోవైపు ఆప్ ప్రభుత్వం సాంకేతిక అంశాల వెనుక దాగి, పూర్తి మౌనం వహించాయని విమర్శించారు.



## జంతర్ మంతర్ వద్ద భారీ భద్రత

**అక్షరటుడే, ఢిల్లీ:** నిరసనకారులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను వెంటనే ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో తమ ఉద్యమాన్ని మళ్లీ ఉధృతం చేస్తామని కాక్రోచ్ జనతా పార్టీ ప్రభుత్వాన్ని హెచ్చరించింది. ఈ పరిణామాల నేపథ్యంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద పోలీసులు భద్రతను అత్యంత కట్టుదిట్టం చేశారు. ఉద్యమకారులపై ఎలాంటి న్యాయపరమైన చర్యలు తీసుకోబోమని గతంలో ఇచ్చిన హామీని కేంద్ర ప్రభుత్వం ఉల్లంఘించిందని సీజేపీ తీవ్రంగా ఆరోపించింది. దీంతో నిరసనకారులు పరిమితి దాటి ముందుకు రాకుండా జంతర్ మంతర్ వద్ద పోలీసులు, పారామిలిటరీ బలగాలు, ఇతర భద్రతా ఏజెన్సీలను భారీగా మోహరించారు.